క్లుప్తంగా

సేవలకు సత్కారం



సత్కరిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ చంద్రశేఖర్

చీపురుపల్లి: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురిని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా సత్కరించారు. మండలంలోని రావివలస గ్రామానికి చెందిన గంటాన అప్పారావు, చీపురుపల్లికి చెందిన ఉపాధ్యాయుడు మిరియాల కృష్ణారావును సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్న వారిని ఆదర్శంగా తీసుకొని సమాజ అభ్యున్నతికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఆశయ సాధన సమితి ప్రతినిధులు కర్రోతు విశ్వేశ్వర రావు, అడ్డూరు కృష్ణ, మీసాల అప్పల నాయుడు, వలిరెడ్డి రవీంద్రనాయుడు, మంగళగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మెరకముడిదాం: మండలంలోని ఊటపల్లి గ్రామంలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పొట్నూరు వెంకటఅప్పలనాయుడు, పొట్నూరు అచ్చప్పడు, పొట్నూరు సూర్యనారాయణ, రెడ్డి తవిటినాయుడు, గేదెల లక్ష్మణరావు, వాల్తేటి సత్యవతి, వాల్తేటి సత్యం, వాల్తేటి రామారావు, రెడ్డి లక్ష్మీనారాయణ తదితరలు ఉన్నారు. గ్రామ సర్పంచ్ సంగంరెడ్డి వెంకటలక్ష్మి, పార్టీ మండల నాయకులు ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేరరావు, కోట్ల మోతీలాల్‌నాయుడు సమక్షంలో వారంతా వైఎస్సార్‌సీపీ చేరారు.

నేత్ర, అవయవ దానంపై అవగాహన

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం కోడూరు గ్రామంలో ఉపాధి పనుల్లో పాల్గొన్న వేతనదారులకు మానవీయతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నేత్ర, అవయవ దానంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు గోవిందరాజులు మాట్లాడుతూ.. అవయవ దానం చేయడం ద్వారా మనం మరణించాక వాటిని ఇంకొకరికి పెట్టడం ద్వారా వారి జీవితంలో వెలుగులు నింపావచ్చన్నారు. అపోహలు వీడి నేత్ర, అవయవ దానం చేసేందుకు ప్రజలు ముందుకురావాలని పిలుపునిచ్చారు.

నేడు ఉపకరణాల ఎంపిక శిబిరం

చీపురుపల్లి: విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో శనివారం ఎంపిక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు నియోజకవర్గ స్థాయిలో ఎంపిక శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువుల ఆక్రమణకు అడ్డుకట్ట

శృంగవరపుకోట: మండలంలో ముషిడిపల్లి పంచాయతీ పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ఉన్న నాలుగు చెరువులను గుర్తించి హద్దులు నిర్ణయించామని, అవి ఆక్రమణకు గురికాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సర్వే నంబరు 59లో రొంగలి వారి చెరువు, సర్వే నెం.68లో పిల్లిగెడ్డవాని చెరువు, సర్వే నెం.66లో నందికార చెరువు, సర్వే నెం.17-3లో ఉన్న చెరువు హద్దులను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. లేఅవుట్ యాజమానులకు, చెరువులకు ఎటువంటి సంబంధం లేదని తహసీల్దార్ స్పష్టం చేశారు.

వామపక్షాల ప్రచారభేరి

శృంగవరపుకోట: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, మోదీ నాయకత్వంలో అదానీ, అంబానీలు అపర కోటీశ్వరులు అవుతుంటే.. సామాన్య, మధ్య తరగతి ప్రజలు బానిసలుగా బతకాల్సిన దుస్థితి నెలకొందని సీపీఐ, సీపీఎం నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వేరువేరుగా ర్యాలీలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించే కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ హిందుత్వ ముసుగులో ప్రజాధనాన్ని దోచేసి కార్పొరేట్లకు పంచుతోందని విమర్శించారు. వారి దురాగతాలను ప్రజలకు తెలియచెప్పేందుకు ఈనెల 14 నుంచి 30 వరకు వాడవాడలా ప్రచారభేరి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

లక్కవరపుకోట: ప్రజా వ్యతిరేక విధానాలు అమలుచేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించి దేశాన్ని కాపాడుకుందాం అంటూ సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలపై నేటి నుంచి 30వ తేదీ వరకు ప్రచార భేరీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం..



చీపురుపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తదితరులు

భారత రాజ్యాంగ నిర్మాత, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని శుక్రవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు అంబేకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, అంటరానితనం నిర్మూలన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన కృషిని గుర్తుచేసుకుని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. చీపురుపల్లిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లిన చంద్రశేఖర్ రాజ్యాంగ నిర్మాతకు నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తవలస: దెందేరులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు, తదితరులు



గజపతినగరం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో సీట్లు పంచిపెడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు



గజపతినగరం రూరల్: కొత్తబగ్గాంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ గార తవుడు



గుర్ల: అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు



వేపాడ: బొద్దాం సచివాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే కడుబండి



బొండపల్లి: గరుడుబిల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎంపీపీ చలంనాయుడు, తదితరులు



దత్తిరాజేరు: పెదమానాపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ రాతు రాజేశ్వరి



గంట్యాడ: పెదవేమలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు



చీపురుపల్లి రూరల్: గరివిడి పట్టణంలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో జెడ్పీటీసీ, ఏఎంసీ మాజీ ఐర్మన్ మీసాల, దళిత నాయకులు



జామి: జామిలో జైభీమ్ యువత బైక్ ర్యాలీ



లక్కవరపుకోట: జమ్మాదేవిపేటలో జ్యోతీరావు పూలే పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది

రాష్ట్రంలో సువర్ణపాలన

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాల లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ప్రజా సమక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, నాలుగేళ్లుగా రాష్ట్రంలో సువర్ణపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మేజర్‌పంచాయతీలో సచివాలయం-5 పరిధిలోని రాజుపాత్రునిపాలెంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన, దేశాభివృద్ధి సాధ్యమని భావించి మీ పిల్లల చదువుల బాధ్యతను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారన్నారు. నాడు-నేడు కార్యక్రమం కింద వేల కోట్ల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. సీఎం జగన్ ప్రజలకు చేస్తున్న మేలును ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని, లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి జయప్రకాష్, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, సర్పంచ్ మచ్చ రామస్వామి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, పార్టీ నాయకులు పెదిరెడ్ల సూరిబాబు, లెంక రామన్నపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆరాటమంతా దోచుకునేందుకే...

• రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ
• ఊటపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించిన మంత్రి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

మెరకముడిదాం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికార ఆరాటమంతా దోచుకుని దాచుకునేందుకేనని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. మండలంలోని ఊటపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవనీతి రహితంగా అనేక సంక్షేమపథకాల ఆర్థిక లబ్ధిని నేరుగా అర్హుల ఖాతాలకు చేరవేస్తుండడాన్ని చూసి చంద్రబాబునాయుడు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్లతో ఊరిలోనే ప్రభుత్వ సేవలన్నీ అందించే సరికొత్త వ్యవస్థను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. సర్పంచ్ సంగంరెడ్డి వెంకటలక్ష్మి మాట్లాడుతూ కొందరికి ఇళ్లపట్టాలు అందలేదని బొత్స దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన అక్కడ ఉన్న తహసీల్దార్, జేసీను ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించాలని సూచించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమపథకాలు మరే రాష్ట్రంలోనూ అమలు కావడంలేదన్నారు. ఊటపల్లి గ్రామంలో ఇంటింటికీ కుళాయిల నీరు అందుతుందంటే మంత్రి బొత్స సత్యనారాయణ కృషితోనే సాధ్యమైందన్నారు. అనంతరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ అవినీతిరహిత పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డికృష్ణవేణి, తాడ్డి వేణుగోపాల్ రావు, కోట్ల విశ్వేశ్వరరావు, మోతీలాల్‌నాయుడు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. గ్రామస్తుల వినతి మేరకు ఊటపల్లి గ్రామం నుంచి బొబ్బిలికి బస్సు సౌకర్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన అవసరం



కొత్తవలస: మాట్లాడుతున్న ఫైర్‌స్టేషన్ అధికారి అశోక్‌కుమార్

కొత్తవలస: అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో శుక్రవారం ఫైర్ సేఫ్టీ వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా అగ్నిప్రమాదాల నివారణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. విపత్తులు సంభవించినపుడు ఆందోళన చెందకుండా అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చన్నారు. వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో శారద కార్మాగారం డిప్యూటీ జనరల్ మేజనేర్ సన్యాసిరావు, ఫైర్ స్టేఫ్టీ హెడ్ పద్మాకర్, ఫైర్‌మేన్‌లు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: పట్టణంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయంలో సర్పంచ్ డి.సంతోషికుమారి ఫైర్ ఆఫీసర్ షేక్ మదీనాతో కలిసి అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. 1944లో విక్టోరియా డాక్ వద్ద జరిగిన భారీ ప్రమాదంలో అశువులు బాసిన 66 మంది ఫైర్‌సిబ్బంది సంస్మరణార్థం ఏటా ఏప్రిల్ 14న జాతీయ అగ్నిమాపక దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. అమరులైన ఫైర్ సిబ్బందికి నివాళులర్పించారు. అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పత్రాలను సర్పంచ్ విడుదల చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

నేడు అవగాహన సదస్సు

చీపురుపల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీఓ కేవీఎన్ రాజరాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సదస్సుకు హాజరవుతారన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

గంట్యాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 15 నుంచి 30 వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ రెడ్డి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవాల సంరక్షణలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా టీకాలు, మందులు పంపిణీ చేస్తోందన్నారు. జీవాల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

కొత్తవలస: మండల కేంద్రంలోని ఈశ్వర వేంకట సహిత అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మణికంఠ పీఠం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కె.కిరణ్‌కుమార్ శర్మ స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మంగళపాలెం, మిందివలస గ్రామాల్లో అన్నసమారాధనలు చేశారు.

యువత రక్తదానం

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లిలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 40 మంది యువకులు రక్తదానం చేసినట్లు సర్పంచ్ గర్భాపు విజయలక్ష్మి, శ్రీనివాస్ తెలిపారు. విజయనగరానికి చెందిన ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు శిబిరంలో సేవలందించారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల మంజూరు

• ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: పార్టీలతో సంబంధం లేకుండా.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని, అర్హులైన టీడీపీ నాయకులకు కూడా పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని పోరలి గ్రామంలో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, సర్పంచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉపాధిపనులు ప్రారంభించాలని, గృహాలు కావాలని, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరడంతో త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రాతు రాజేశ్వరి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, ఏఎంసీ ఉపాధ్యక్షుడు మండల శ్రీను, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్, విద్యుత్ ఏఈ ఆదిత్య, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఉపసర్పంచ్ గంగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జీపీ అగ్రహారంలో..

బొండపల్లి: మండలంలోని జి.పి.అగ్రహారంలో శనివారం ఉదయం 8 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొనే ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



పురిటిపెంట గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ శౌంఠ్యాన విజయలక్ష్మి

గజపతినగరం: పంచాయతీల్లో ఇంటిపన్ను బకాయి వసూళ్లను వేగవంతం చేయాలని గజపతినగరం, పురిటిపెంట సర్పంచ్‌లు నరవ కొండమ్మ, శౌంఠ్యాన విజయలక్ష్మి అన్నారు. ఆయా పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఇంటిపన్నుతో పాటు పంచాయతీలకు రావాల్సిన ఆదాయ వనరులపై సిబ్బంది దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు తయారీపై పలు సూచనలు చేశారు. ప్రజలు పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ డి.జనార్దనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, వైస్ సర్పంచ్‌లు మండల సురేష్, కర్రి రామునాయుడు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని సోంపురం, బొద్దాం, వేపాడ గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మురిపిండి గంగరాజు, ఎర్రా రామసత్యవతి, మిరపాక అర్జునమ్మ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు.

ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి

వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా.. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని బలంగా కొరుకుంటున్నారు. మా నమ్మకం నువ్వే జగనన్నా అంటూ 82960 82960 నంబరుకు మిస్ట్‌కాల్ ఇచ్చి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్నారు. ఎస్.కోట మండలం వీరనారాయణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు పాల్గొని గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



శృంగవరపుకోట: వీరనారాయణంలో ఓ ఇంటికి జగనన్న స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు



చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం వెదుల్లవలసలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక నాయకులు



వేపాడ: ఆతవలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న సర్పంచ్ వేమననాయుడు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు



గజపతినగరం: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బొండపల్లి: సీటీకే పల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ చలం నాయుడు, వైస్సార్‌సీపీ నాయకులు



చీపురుపల్లి: కుమ్మరికాలనీలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు